మధూహ  అతని చెయ్యి పట్టుకుని వెనక్కి తోసింది. నిలదొక్కుకుని మళ్ళీ ముందుకు వచ్చాడు. "నిన్ను నమ్మి మా రహస్యాలన్నీ చెబితే వెళ్ళి పేషెంటుకి చెపుతావా?" అంటూ ఆమెరెండు భుజాలు పట్టుకుని విసురుగా దగ్గిరకి లాక్కున్నాడు. ఆమె కూడా అంతే ఆవేశంగా "అవును, చెప్తాను. ఆమె నా స్నేహితురాలు. అందుకే చెప్పాను. అంతేకాదు మీరు చేసే మోసాలు మొత్తం ప్రపంచానికంతా చాటి చెపుతాను" అంది.

అతడు మరింత రెచ్చిపోయి ఆమెని క్రిందికి తోశాడు.

అతడిని ఆమె పట్టుకుని వుండటంతో ఆమెతో పాటు తను కూడా క్రిందపడ్డాడు. ఆమెని ఆక్రమించుకుంటూ "ఏం చేస్తావు? ఏం చెస్తావే?" అంటూ పిచ్చివాడిలా గొణుగుతూ ఆమెని వివస్త్రని చేయటానికి ప్రయత్నించసాగాడు.

అతడి ప్రయత్నం ఆమెకి అర్థమవటానికి అరనిముషం పట్టింది. నిర్విణ్ణురాలైంది. గింజుకోవటానికి కూడా ప్రయత్నించకుండా రుద్దకంఠంతో "రాజూ ఏమిటిది? ఏమిటిది?" అని మాత్రం అనగలిగింది.

లోపల్నుంచి దుఃఖం తన్నుకు వస్తోంది. తన స్నేహితుడు ఈ విధంగా ప్రవర్తించగలడని కలలో కూడా అనుకోలేదు.

అతడామెని పూర్తిగా ఆక్రమించుకుంటూండగా ఆమె స్పృహలోకి వచ్చింది. రెండు చేతుల్తోనూ దూరం జరపటానికి ప్రయత్నించసాగింది. "వదులు రాజూ, వదులు" అని అంటూనే వుంది.

అతడు మాత్రం చాలా కసిగా కోపంగా వున్నాడు.

అతడిలో అంత ఆవేశాన్ని ఆమె ఎప్పుడూ చూడలేదు. డాక్టర్ విశాల్ పట్ల అతడికి అంత గురుభక్తి వుందని ఆమె అనుకోలేదు.

తను పూర్తిగా మోసగింపబడినట్టుగా అతడు భావిస్తున్నాడు. తమ రహస్యాలన్నీ ప్రపంచం మొత్తం వెల్లడి అయినట్టుగా భీతిల్లుతున్నాడు. ఆ భయం ఆవేశం రూపంలో బయటకొస్తూంది. ఈ విధంగా ప్రతీకారం తీర్చుకుంటున్నాడు.

ఆమెలో శక్తి క్రమంగా తగ్గిపోసాగింది.

ప్రతిఘటించడానికి కూడా శక్తి లేనట్టు నిస్సత్తువగా వుండిపోయింది.

ఆమె కళ్ళ లోంచి కన్నీరు ధారాపాతంగా కారుతోంది. అది మనసుకి సంబంధించిన దుఃఖం. ఈ ప్రపంచంలో ఎంతమంది ఆడపిల్లలు తెలిసీ తెలియని వయసులో అప్పుడే విచ్చుకుంటున్న గులాబీలాంటి తమ మనసుని తొలిప్రేమ రూపంలో అబ్బాయిలకి అర్పించి వుంటారు? ఆ తరువాత అభిరుచులు కలవకనో విధి వైపరీత్యం వల్లనో విడిపోయి వుంటారు? తమ ఎంపిక తప్పని తెలుసుకోగలిగేటంత ఆత్మవిమర్శ చేసుకుంటారా? లేక అయిందేదో అయిపోయిందిలే అని మామూలు జీవితపు గాడిలో పడి వుంటారా? అందులో ఎంతమంది తమ స్నేహితులకి ఈ విధంగా శరీరాన్ని అప్పజెప్పివుంటారు? శరీరం పాడయినందుకు కాదు దుఃఖం. తొలిప్రేమ అర్పించినందుకు. కరెక్టుగా ఎన్నిక చేసుకోలేక పోయినందుకు!!

అంత విచక్షణాజ్ఞానం లేకుండా ప్రేమలో పడినందుకు!!!

ఆమెలో ప్రతిఘటన లేకపోవటాన్ని అతడు మరోలా అర్థం చేసుకున్నాడు. సహకరిస్తోందనుకున్నాడు.

విశాల్ క్లినిక్‌లో హిప్నోటిక్ ట్రాన్స్‌లోవున్న ఆడవాళ్ళని ఒకరిద్దరిని ఈ విధంగానే అతడు అనుభవించాడు. సగంలో మత్తు నుంచి బయటపడి కొందరు గింజుకునే వారు. తరువాత సహకరించేవారు. కొందరీ విషయం బయటకు చెప్పుకోలేక మౌనంగా వుండిపోయేవారు .

ఆవేశం తగ్గాక అతడు మామూలు మనిషయ్యాడు.

ఆమెలో ఏ రియాక్షనూ లేకపోయేసరికి విస్మయం చెందాడు. "సారీ, ఆ కోపంలో నన్ను నేను కంట్రోలు చేసుకోలేకపోయాను. నిన్ను నమ్మి మా గురించి చెప్తే అది నువ్వు బయటకు వెల్లడి చేస్తావన్న కోపంలో ఇదంతా జరిగిపోయింది" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

ఆ మౌనం  మరింత గిల్టీగా ఫీలయ్యేట్టు చేయటంతో "అయినా ఇప్పుడేం జరిగిందనీ? ఎలాగో పెళ్ళయ్యాక జరగవలసింది కాస్త ముందు జరిగింది అంతేగా" అంటూ నవ్వటానికి
ప్రయత్నం చేశాడు.

ఆమె బ్లాంక్‌గా చూసిందతనివైపు.

అతను " వీలైనంత త్వరగా మన వివాహానికి ముహూర్తాలు పెట్టిస్తాను" అంటూ మరోసారి ఆమెను దగ్గిరకు తీసుకోబోయాడు. ఆమె నెమ్మదిగా విడిపించుకుంది.

భార్యా భర్తల మధ్య కూడా తరచు రేప్ జరుగుతుందని ఆమె ఎక్కడో చదివింది. అదేమిటో అప్పట్లో అర్థం కాలేదు. ఇప్పుడవుతోంది. అది జీవితాంతం ఇలాగే వుంటుందేమో అన్న భయం కూడా మొదలవుతోంది.

ఏదో ఎక్కడో తెగిపోయిన ఫీలింగ్.

## 5

ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్న విష్ణు స్వింగ్‌డోర్స్ తెరుచుకోవటంతో తలెత్తి చూశాడు. లోపలికి వస్తున్న భార్యని చూడగానే ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవయ్యాయి.

లక్ష్మి ఎప్పుడూ ఆఫీస్‌కి రాదు. అసలింతవరకూ ఎప్పుడూ రాలేదు కూడా.

"బిజీగా వున్నారా?"

"లేదు కూర్చో. ఏమిటిలా వచ్చావ్?"

“ఇంట్లో తోచటం లేదు”.

“ఏదైనా వ్రాసుకోలేకపోయావా?”

“దాన్ని గురించే వచ్చాను. కొంచెం వివరాలు కావాలి. వివరాలంటే మరీ ఎక్కువ ఇన్ఫర్మేషన్ కాదు. వ్యాపారం గురించి. అంటే ఎలా చెప్పాలో తెలియటం లేదు. ఒక బిజినెస్ మాన్ దినచర్య అతడి కష్టాలూ, విసుగూ, చిరాకు, టెన్షన్.... వీటన్నింటి గురించీ వ్రాయాలనుకున్నాను”.

“ఈజిట్ ? వ్రాయి. బాగా వ్రాయి” అన్నాడు.

ఆమె కొన్ని కాగితాలు అందించింది.

అతడు పదినిముషాల పాటు శ్రద్ధగా చదివాడు. అంతసేపూ అతడినే చూస్తూ కూర్చుంది. అది తనకి సంబంధించిన సబ్జెక్టు కావటంతో ఇంటరెస్టింగ్‌గా చదవసాగాడు.

అంతా చదివి “సినాప్సిస్ బావుంది. బాగానే వ్రాస్తావే నువ్వు” అన్నాడు.

ఆమెకి సంతోషం వేసింది. బయటివాళ్ళు మెచ్చుకోవటం వేరు. తన వాళ్ళు మెచ్చుకోవటం వేరు. రచననే కాదు ఏ పనినైనా.

ఆమె సంతోషానికి మరో కారణం కూడా వుంది. అతనితో మొత్తం చదివించింది. అదీ కారణం.

అతడికసలు ఇలాంటి ఉత్సాహాలు లేవు. కానీ కథ తన ఫీల్డుకి సంబంధించినది అవటంతో ఇంటరెస్టింగ్‌గా చదివాడు.

ఆమెకు కావాల్సింది కూడా అదే. తన రచనా వ్యాసంగంలో అతడికి ఆసక్తి కలిగించటం. ఆ విషయంలో కృతకృత్యురాలైంది.

అతడు స్క్రిప్టు చదివి బల్లమీద పెట్టి “చెప్పు. ఏం వివరాలు కావాలి?” అని అడిగాడు.

“అలా చెప్పలేను. నేను మన ఆఫీసులో కొన్నాళ్ళు పని చేద్దామనుకుంటున్నాను”.

అతడికి పొలమారినట్టు అయింది. “మ ...... మన ఆఫీసులోనా?” అన్నాడు.

ఆమె నవ్వుతూ “అదే ...... మీ ఆఫీసులో” అంది.

“సర్లే , ఆ విషయం కాదు. అయినా నువ్వు... తరువాత ఏం మాట్లాడాలో తెలియక ఆగిపోయాడు.

“కొన్నాళ్ళు చేస్తే తప్ప ఈ విషయాలన్నీ అవగాహనకు రావు. ఇంటర్వ్యూ పద్ధతిలో వివరాలు సేకరించటం కన్నా ఇలా ప్రత్యక్షంగా చూస్తే ఇంకా బాగా వ్రాయొచ్చనిపించింది. బయట ఒక టేబులూ కుర్చీ వేయిస్తే, మిమ్మల్ని డిస్టర్బ్ చేయకుండా నా పని నేను చేసుకుంటాను”.

“డిస్టర్బెన్స్ కాదు కానీ....” అతడు సందిగ్దంలో తటపటాయించాడు “స్టాఫంతా ఏమనుకుంటుంది? అయినా నువ్వేం పని చేయగలవు?”.

“కంట్రోల్”

“వ్వాట్”

“ యజమాని భార్య తమతోపాటు కూర్చుంటే స్టాఫ్ ఎక్కువ కబుర్లు చెప్పుకోవటానికి వీలుండదు. అదొక్కటి చాలు. నాకు మీరు జీతమిచ్చి పనిలో పెట్టుకోవటానికి” నవ్వింది.

“అయినా ఇదంతా నెలా రెండునెలలేగా”.

అతడు బెల్ కొట్టి అకౌంటెంట్‌ని పిలిచి సూచన్లు ఇచ్చాడు. అకౌంటెంట్ కూడా ఆశ్చర్యపడ్డాడు. కానీ పైకి కనిపించలేదు.

అతడితోపాటు వెళ్ళి కూర్చుంది.

స్టాఫ్‌కి ఈ విషయం తెలిసినట్టుంది. ఆఫీసంతా కొంచెం గంభీర వాతావరణం చోటు చేసుకుంది.

ఆ రోజు హోటల్‌లో కనిపించిన అమ్మాయి కూడా అక్కడే వుంది. వంచిన తలెత్తకుండా పని చేసుకుపోతున్నట్టు వుంది. లక్ష్మికి ఆమెని చూస్తే ఎందుకో జాలి వేసింది.

లంచ్‌టైమ్‌లో వెళ్ళి ఎదురుగా కూర్చుంది. టిఫిన్‌బాక్స్ అప్పుడే తెరిచిన ఆ అమ్మాయి లక్ష్మిని చూసి తత్తరపడి కంగారులో నీళ్ళు మీద ఒలకపోసుకున్నంత పని చేసింది.

లక్ష్మి నవ్వుతూ "ఈ రోజు నుంచీ నాక్కొంచెం పని నేర్పాలి" అంది.

"అ ...... అ ...... అలాగే"

ఆమె నవ్వుతూనే " ఇందులో డబుల్ మీనింగ్ డైలాగులేమీ లేవులెండి" అంది.

ఆ అమ్మాయి మొహం ఎర్రబడింది.

"మీరొకసారి నవ్వితే హోటల్ విషయం ఎవరికీ చెప్పనని హామీ ఇస్తాను".

ఆ అమ్మాయికి లక్ష్మి ఏం చెపుతుందో అర్థం కాలేదు. అర్థమయ్యాక సిగ్గుతో తలదించుకుంది. ఈ లోపులో లోపల్నుంచి పిలుపొచ్చింది.

"నీ లంచ్ సంగతేమిటి?" అన్నాడు విష్ణు. అతడు ప్రతిరోజూ బాక్స్ తెచ్చుకుంటాడు.

"చేసే వచ్చాను. రేపట్నుంచీ నేనూ తెస్తాను" అంది.

అతడు లంచ్ చేస్తూంటే వడ్డించింది. "ఏం నేర్చుకున్నావ్?" అని అడిగాడు.

"బ్యాలన్స్ షీట్లూ అమ్మకాల వివరాలూ చూశాను. వాటికన్నా ముఖ్యంగా గమనించిందేమిటంటే మీకు చాలా పని వుంటుంది. కొంత సంపాదించాక డబ్బు దానంతట అదే వస్తుందనుకున్నాను. ఎప్పుడూ కష్టపడుతూనే వుండాలని ఈ రోజు మిమ్మల్ని చూస్తే అర్థమైంది".

ఆ మెచ్చుకోలుకి అతడి మొహంలో ఆనందం స్పష్టంగా కనిపించింది.

నిజానికి ఆమె అన్నదానిలో అతిశయోక్తి కూడా ఏమీ లేదు. ప్రొద్దున్నించీ రకరకాల విజిటర్స్‌తో అతడు చాలా బిజీగా వున్నాడు. తన కష్టాన్ని ఆమె గుర్తించిందన్న సంతృప్తితో అతడి పెదాలు నవ్వుతో అదోలా విచ్చుకున్నాయి.

"ఇది కూడా వ్రాస్తావా నీ కథలో?" అన్నాడు.

"వ్రాస్తాను. మొగవాళ్ళు భార్యల్ని చేతనయితే నువ్వు సంపాదించు చూద్దాం అని ఎందుకంటారో కూడా వ్రాస్తాను".

అతడు ఉలిక్కిపడి అందులో వ్యంగ్యాన్ని గుర్తించినట్టు ఆమెవైపు చూశాడు.

లక్ష్మి నవ్వి "నాకు ఎంత జీతం ఇవ్వబోతున్నారు?" అని అడిగింది. అతడేదో సమాధానం చెప్పబోతున్నంతలో ఫోన్ మ్రోగింది. అతడో నిముషం మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"సాధారణంగా మీరొకరే చేస్తారా లంచ్?" అని అడిగింది. నిజానికి ఆమె చాలా క్యాజువల్‌గా అడిగినా అతడు ఇబ్బందిగా చూసి సమాధానం చెప్పటానికి ఆలస్యం చేయటంతో మాట మారుస్తూ "నేనీ రోజు ఆఫీసుకొస్తూ ఏమనుకున్నానో తెలుసా? మొన్నరాత్రి మీరు చెప్పారుగా వ్యాపారంలో నష్టం వస్తుందని" అంది. "ఆ విషయంలో..."

“ఏమనుకున్నావ్?”

“ఆఫీసుకొచ్చి  మొదటిసారి సీట్లో కూర్చోగానే మీ వ్యవహారాలన్నీ పరిశీలించి లంచగొండి అయిన మీ మేనేజర్ని శిక్షించి క్షణాల్లో మీ ఆఫీసు పరిస్థితి మార్చేసినట్టు... మీరు ఆనందంతో తబ్బిబ్బు అయిపోయి నన్ను గాలిలో ఎత్తి తిప్పేస్తూ కన్నీళ్ళతో కదిలిపోయినట్టు...”.

ఆమె మాటలు పూర్తి కాలేదు.

అతడు ఎంత గట్టిగా నవ్వాడంటే లోపల ఏం జరిగిందో  అన్న ఖంగార్లో ప్యూన్ తలుపు తీసి చూశాడు. నవ్వుతో అతడికి పొలమారింది. ఆమె నీళ్ళు అందిస్తూ “ఏదో సినిమాలో అలాగే జరుగుతుందండీ” అంది అమాయమకంగా.

అది అమాయకత్వం కాదనీ అంతకు ముందు అడిగిన ప్రశ్నకి తను సమాధానం చెప్పేటందుకు ఇబ్బంది పడటం చూసి కావాలనే మాట మార్చిందనీ ఊహించలేనంత అమాయకుడు కాడు అతడు.

లంచ్ అయిన తరువాత ఆమె తిరిగి తన సీట్‌లోకి వచ్చేసింది.      అంతకు ముందు ఆమె చెప్పింది నిజమే. ముందు హాల్‌లో ఆమె వుండటం వలన స్టాఫ్ నిజంగానే ఎక్కువ పనిచేస్తున్నారు.

విష్ణు ఆమెని లోపలికి పిల్చి ఒకటి రెండు పనులు చెప్పాడు కూడా. మేనేజర్ సాయంతో ఆమె వాటిని పూర్తి చేసింది.

సాయంత్రం మాధుర్ వచ్చాడు.

ఆమెని ఆఫీసులో చూసి ఆశ్చర్యపోయాడు. కొంచెం సేపు విష్ణుతో మాట్లాడిన తరువాత లేచి “నేనెళ్ళొస్తాను” అన్నాడు.

“అదేమిటి? క్లబ్‌కి వెళ్దాం ఉండు” అన్నాడు విష్ణు. మాధుర్ ఇబ్బందిగా చూశాడు.

"నేను ఆటోలో వెళ్తాలెండి" అంది లక్ష్మి.

'అలాగే వెళ్ళు' అనలేక విష్ణు "నేను తనని ఇంటి దగ్గిర దింపేసి వస్తాను" అన్నాడు మాధుర్‌తో.

మాధుర్ కొద్దిగా తటపటాయించి "మా వాళ్ళు ఎప్పటినుంచో సినిమాకి వెళ్దామంటున్నారు. ఈ రోజు తీసుకువెళ్తాను" అన్నాడు లేస్తూ.

ఆరింటికి భార్యాభర్తలు ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. కార్లో విష్ణు కాస్త సీరియస్‌గా వుండటం గమనించింది. రొటీన్ పాడవటం వలన కలిగే చిరాకు అలజడి అది.

ఆ దార్లో మల్లెపూల రిక్షా దగ్గిర ఆపు చేయమంది.

"ఎంతవి కావాలి?" అని అడిగాడు.

"కిలో"

సరిగ్గా వినిపించలేదేమో అనుకుని "వ్వాట్?" అన్నాడు.

"లేకపోతే ఏమిటండీ? పెళ్ళానికి ఎన్ని మల్లెపూలు కొనాలో తెలీదా? ఇన్ని సంవత్సరాలు కాపురం చేశారు" అంది.

అయిదు నిముషాలు గడిచాక అతడు వచ్చి కూర్చుని కారు స్టార్ట్ చేశాడు.

"పూలేవీ" అడిగింది.

"వెనుక డిక్కీలో పెట్టాను"

ఆమె అదిరిపడి "మల్లెపూలు డిక్కీలో పెట్టారా? తల్లో పెట్టుకునేవి?" అని అడిగింది.

“అవును, రెండు గంపలు”

“ఏడాదికి సరిపడా కొన్నారా?”

అతడు మాట్లాడలేదు. ఇంటికొచ్చి స్నానం చేసి వంట ప్రారంభించింది. అతడు ముందు హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

“కొంచెం వొచ్చి ఉల్లిపాయలు కోసిపెట్టొచ్చుగా”

అతడు విసుక్కుంటూ వచ్చి పని చేయటం ప్రారంభించాడు గంటలో వంట పూర్తయింది.

“పైన డాబామీద కూర్చుందాం” అంది.

“బోరు” అన్నాడు విసుగ్గా.

“ఈ ఒక్కరోజుకీ. రేపటినుంచీ నాకూ ఎలాగూ కుదరదు”

అతడు విస్మయంగా “ఏం?” అని అడిగాడు.

“కంప్యూటర్ క్లాస్‌లో చేరుతున్నాను. వారానికి నాలుగు రోజులు. రాత్రి ఏడునుంచీ పదివరకూ”.

“మరి అంతరాత్రి ఒక్కదానివే రాగలవా?”.

“మీరు క్లబ్‌నుంచి వచ్చేటప్పుడు తీసుకువద్దురు గానీ”.